# ట్రంప్ 3వ ప్రపంచ యుద్ధానికి ఆజ్యం పోస్తున్నాడా !

ఇరాన్ చేస్తున్న అణ్వాయుధాల తయారీ ప్రయత్నాలను వ్యతిరేకించిన ఇజ్రాయిల్ తీసుకున్న తీవ్ర నిర్ణయంతో ఇరాన్ న్యూక్లియర్ ప్రదేశాలను లేదా ఫెసిలిటీలను నేరుగా "ఆపరేషన్ రైజింగ్ లయన్" కోడ్‌తో బాంబులతో పేల్చి మరో యుద్ధానికి తెర లేపారు ఇజ్రాయిలీ అగ్రనేత నేతన్యాహు. ఇప్పటికే ఉక్రెయిన్ – రష్యా, ఇజ్రాయిల్ – పాలస్తీనా యుద్ధాలు తీవ్ర స్థాయిలో కొనసాగుతున్న వేళ నేడు ఇజ్రాయిల్ – ఇరాన్ సంక్షోభం ముదిరినా వేళ అమెరికా 21 జూన్ 2025న ఇరాన్‌లోని మూడు అణ్వాయుధ తయారీ కేంద్రాలను బాంబులతో పేల్చడంతో ఈ సంక్షోభం మరో ప్రమాదకర మలుపు తిరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. నేడు ఇజ్రాయిల్ పక్షాన అమెరికా చేసిన తీవ్ర దాడులతో చైనా, రష్యా ఇరాన్ పక్షాన చేరితే మరో 3వ ప్రపంచ యుద్ధానికి తెర లేస్తుందేమో అని పౌర సమాజం భయపడుతున్నది. ఇప్పటికే గత 10 రోజులుగా జరుగుతున్న ఇజ్రాయిల్ – ఇరాన్ యుద్ధంలో ఇరాన్‌కు చెందిన 865 మంది చనిపోగా, 3,500ల వరకు గాయపడడం, టెహరాన్ నగరంలో కోట్ల డాలర్ల ఆస్తులు నష్టం కావడం జరిగింది. ఇజ్రాయిల్‌పై ఇరాన్ చేసిన ప్రతి దాడుల్లో రాజధాని టెల్ ఎ వీవ్‌తో పాటు ఇతర పౌర ఆవాసాలు నేలమట్టం కావడం, వంద వరకు ప్రాణాలు పోవడం, 500 వరకు గాయపడడంతో పాటు ప్రధాన రక్షణ కేంద్రాలే లక్ష్యంగా మారడం జరిగింది. ఇరాన్ సుప్రీమ్ లీడర్ అయొతుల్లా అలీ ఖోమినీని చంపడానికి కూడా వెనకాడబోమని ఇజ్రాయిల్ తెలుపడం ఈ యుద్ధ తీవ్రతను సూచిస్తున్నది.

ఇరాన్‌పై అమెరికా బాంబు దాడులు – చైనా, రష్యా ప్రతిస్పందనలు:

21 జూన్‌న అకస్మికంగా, అనూహ్యంగా అమెరికన్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న ఆక్షేపణీయ నిర్ణయంతో ఇరాన్‌లోని మూడు అణ్వాయుధ ప్రదేశాలు ఫర్డో, నటాంజ్, ఇస్ఫాహన్ కేంద్రాలను క్షణాల్లో నేలమట్టం చేయడంతో ఈ సంక్షోభం ముదిరి మరో భీకర యుద్ధంగా మారుతూ పాకానపడుతున్నట్లు తోస్తున్నది. ఇజ్రాయిల్ పక్షాన చేరి అమెరికా విజయవంతంగా చేసిన ఈ మూడు దాడులకు ప్రతిస్పందనగా చైనా, రష్యాలు ఇరాన్ పక్షాన చేరితే రానున్న రోజుల్లో 3వ ప్రపంచ యుద్ధ వాతావరణం నెలకొనవచ్చని అంచనా వేయడం జరుగుతున్నది. నేడు అమెరికా చేసిన బాంబు దాడులకు స్పందించిన చైనా ఈ చర్య మరో "ప్రమాదకర మలుపు తిరగవచ్చు (జేంజరస్ టర్నింగ్ పాయింట్)" అని తెలుపడం గమనార్హం. రెండు దేశాల మధ్య నెలకొన్న సంక్షోభంలో మూడవ దేశంగా అమెరికా దూరడంతో పాటు మిలటరీ చర్యలకు ఉపక్రమించడం సరైన నిర్ణయం కాదని, ఇది మరో యుద్ధానికి ఆజ్యం పోసినట్లు కనిపిస్తున్నదని చైనా విమర్శించడం చూస్తున్నాం. రష్యన్ అధ్యక్షులు పుతున్ మాట్లాడుతూ ఇజ్రాయిల్‌లో రష్యన్ భాష మాట్లాడే ప్రజలు 2 మిలియన్లకు పైగానే ఉన్నారని అంటూనే అనాదిగా రష్యా అరబ్, ఇస్లామిక్ దేశాలతో రష్యా మంచి సంబంధాలను కలిగి ఉందని తెలిపారు. నేడు యుద్ధ విరమణకు మార్గాలను వెతకాలని, కాల్పుల విరమణ చేసి చర్చలతో సమస్య పరిష్కారానికి కృషి చేయాలంటూ పరోక్షంగా అమెరికన్ ట్రంప్‌కు సలహా చురుకు ఇవ్వడం జరిగింది.

ఇరాన్‌పై అమెరికా చేసిన బాంబు దాడులు నేటి సంక్షోభ మంటలకు ఆజ్యం పోస్తున్నాయి. నేడు తీవ్రంగా దెబ్బతిన్న ఇరాన్ ప్రతి చర్యలు ఎలా ఉండనున్నాయో అంచనాకు దొరకడం లేదు. అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా తగు సమాధానం ఇస్తుందని ఇరాన్ విదేశాంగా మంత్రి స్పందించడా కొన మెరుపు. నేడు అన్ని విధాలుగా దెబ్బతిన్న ఇరాన్ తిరిగి ప్రతి చర్యలకు పూనుకోవడం ప్రశ్నార్థకంగానే తోస్తున్నది. నేడు ట్రంప్ తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాలతో అమెరికా అంతర్గత సంక్షోభ నిరసన మంటలు కొనసాగడం, ప్రపంచ దేశాలు సుంకాల భారంతో వ్యతిరేకించడం జరుగుతోంది. ఇరాన్‌లోని బషేహర్ అణు కేంద్రంపై ఇజ్రాయిల్ దాడి జరిగితే నాటి "చెర్నోబిల్ తరహా మారణహోమం" జరగవచ్చని కూడా హెచ్చరిస్తున్నారు.



–డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# యోగా ఉద్యమాన్ని బలపరచడానికి ఆంధ్ర ప్రదేశ్ నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి ప్రధానమంత్రి ప్రశంసలు

న్యూఢిల్లీ, జూన్ 23:యోగాను దైనందిన జీవనంలో ఒక భాగంగా చేసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు చూపిన ప్రేరణదాయక నిబద్ధతను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రశంసించారు. ఆరోగ్యం, వెల్‌నెస్ కోసం చేపట్టిన దేశవ్యాప్త ఉద్యమానికి దీనితో మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఆయన అన్నారు.

శనివారం (ఈ నెల 21న) అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని క్షేత్రస్థాయిలో వెల్లువెత్తిన ఉత్సాహాన్ని, ప్రజలు చొరవ తీసుకొని ముందుకు వచ్చి అందించిన మద్దతును శ్రీ మోదీ మెచ్చుకొన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో గిన్నెస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ పొందుపరిచిన ఒక సందేశానికి ప్రధానమంత్రి ప్రతిస్పందిస్తూ:

"ప్రజలను యోగా మరో సారి ఏకతాటి మీదకు తీసుకువచ్చింది. యోగాను తమ జీవనంలో ఓ భాగంగా చేసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ ఉద్యమాన్ని బలపరిచిన తీరుకు వారికి ఇవే నా అభినందనలు. యోగాంధ్ర కార్యక్రమంతో పాటు, నేను కూడా పాల్గొన్న విశాఖపట్నం కార్యక్రమం.. మంచి ఆరోగ్యం కోసం, శ్రేయస్సు కోసం ఎంతో మందికి ప్రేరణను అందిస్తూనే ఉంటుంది" అని పేర్కొన్నారు.

# వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని బలపరచుకోవడానికి తీసుకోదగ్గ చర్యలపై నేతల చర్చలు

న్యూఢిల్లీ, జూన్ 23:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీతో ఇరాన్ అధ్యక్షుడు శ్రీ మసూద్ పెజెష్కియన్ ఈ రోజు టెలిఫోన్‌లో మాట్లాడారు.

ఇరాన్‌లో ప్రస్తుత స్థితిపై... ప్రత్యేకించి ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న సంఘర్షణపై తన దృష్టికోణాన్ని అధ్యక్షుడు శ్రీ పెజెష్కియన్ ప్రధానమంత్రికి సమగ్రంగా వివరించారు.

ఇటీవలి ఉద్రిక్తతలపై భారత్ తీవ్ర ఆందోళన చెందుతోందని ప్రధానమంత్రి అన్నారు. భారత్ శాంతి, మానవతల పక్షం వహిస్తోందని తెలిపారు. ఉద్రిక్తతలను తక్షణం తగ్గించే దిశగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

ప్రాంతీయ శాంతి, భద్రత, స్థిరత్వం.. వీటిని సత్వరం పునరుద్ధరించే ప్రయత్నాలకు భారత్ మద్దతిస్తూనే ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు.

భారతీయ సముదాయానికి చెందిన వారు సురక్షితంగా తమ స్వదేశానికి తిరిగి వెళ్లడానికి సహకరిస్తున్నందుకు అధ్యక్షుడు శ్రీ పెజెష్కియన్‌కు ప్రధానమంత్రి ధన్యవాదాలు తెలిపారు.

వాణిజ్యం, ఆర్థిక సహకారం సహా వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని బలపరచుకొనే దిశగా కృషిని కొనసాగిద్దామంటూ ఇద్దరు నేతలూ తమ ఉమ్మడి నిబద్ధతను పునరుద్ఘాటించారు. పరస్పర సంప్రదింపులను రాబోయే కాలంలో కూడా కొనసాగిద్దామని నేతలు అంగీకరించారు.

# ఏటా వానాకాలంలో విరామం పొందే నక్సలైట్లు ఈ సారి వర్షకాలంలో ప్రశాంతంగా నిద్రపోలేరు.. భద్రతాదళాలు వాటి కార్యకలాపాలను కొనసాగిస్తాయి:కేంద్ర హోం మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 23:నక్సలిజంపై రాయ్‌పూర్‌లో ఈ రోజు ఒక సమీక్షా సమావేశానికి కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఝార్ఖండ్‌తో పాటు ఒడిశా రాష్ట్రాలకు చెందిన డీజీపీలు, ఏడీజీపీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇంతకు ముందు నిలిచిపోయిన నక్సల్–వ్యతిరేక ప్రచారోద్యమాన్ని వారు జోరుగాకొనసాగించడంతో పాటు రాష్ట్రాన్ని నక్సలిజం బారి నుంచి విముక్తం చేసే దిశగా ముందడుగు వేయడం శ్రీ విష్ణు దేవ్ సాయి ప్రభుత్వం, ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రి శ్రీ విజయ్ శర్మ గత ఏడాదిన్నర కాలంలో సాధించిన ఒక అతి గొప్ప విజయమని కేంద్ర హోం మంత్రి అభివర్ణించారు. శ్రీ విష్ణు దేవ్ సాయి, శ్రీ విజయ్ శర్మ నక్సల్–వ్యతిరేక కార్యకలాపాలకు ఒక కొత్త వేగాన్ని ఇవ్వడం ఒక్కటే కాకుండా, భద్రతాదళాల నైతికస్థైర్యాన్ని పెంపొందించడంతో పాటు ఈ పోరాటంలో పూర్తి అంకితభావంతో ముఖ్యమైన తోడ్పాటును కూడా అందించారని ఆయన అన్నారు.

మన దేశం 2026 మార్చి నెలాఖరుకల్లా నక్సలిజం నుంచి పూర్తిగా విముక్తం అవుతుందన్న తన విశ్వాసాన్ని కేంద్ర హోం శాఖ, సహకార శాఖ మంత్రి పునరుద్ఘాటించారు. మన భద్రత దళాలు ప్రదర్శించిన ధైర్య, సాహసాలు, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు రూపొందించిన కచ్చిత వ్యూహాలతో ఈ లక్ష్యాన్ని మనం తప్పక సాధించగలుగుతామని ఆయన అన్నారు. ప్రతి ఏటా వానాకాలంలో విరామం పొందే నక్సల్స్ ఈసారి వర్షాకాలంలో ప్రశాంతంగా కునుకు తీయలేరని, మన భద్రత బలగాలు వాటి కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉండడమే దీనికి కారణమని ఆయన అన్నారు. నక్సలిజం బాట పట్టి దారితప్పిన యువతీ యువకులంతా తమ ఆయుధాలను వదిలిపెట్టాలని, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అమలుచేస్తున్న లొంగుబాటు విధానాన్ని సద్వినియోగపరచుకోవాలని శ్రీ అమిత్ షా యువతకు విజ్ఞప్తి చేశారు. యువతను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, నవ ఛత్తీస్‌గఢ్ అభివృద్ధి ప్రయాణంలో భాగం పంచుకోవడానికి ఇంతకంటే మెరుగైన అవకాశం వారికి

లభించదన్నారు. హింస బాటన సాగుతున్న యువత ప్రభుత్వంపై నమ్మకముంచి సమాజ ప్రధానస్రవంతిలో చేరాలని శ్రీ షా కోరారు. అలా చేయడం వల్ల, వారు తమంత తాము ఛత్తీస్‌గఢ్ అభివృద్ధిలో పాలుపంచుకొన్నవారవుతారని ఆయన అన్నారు.

లొంగిపోయిన నక్సలైట్లకు ఇచ్చిన వాగ్దానాలన్నింటిని కేంద్ర ప్రభుత్వం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నెరవేరుస్తాయని, అంతేకాకుండా మరింత ఎక్కువ సాయం అందించడానికి కూడా కృషి చేస్తాయని శ్రీ షా అన్నారు.

# అమీర్ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటు

**– సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు**



ఖమ్మం, జూన్ 23:(నేటినిజం ప్రతినిధి): కారేపల్లి మండలం, ఉసిరికాయలపల్లి గ్రామం చెందిన సిపిఐ నాయకులు ఎస్.కె అమీర్ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. అమీర్ భార్య రెహనా భర్త మృతిపట్ల కన్నీరు మున్నీరుగా విలపించారు. అమీర్ కు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. జమాల్ పల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అమీర్ భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబాన్ని ఓదార్చారు, అమీర్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు. అమీర్ నిబద్ధతగల కార్యకర్తని క్రమశిక్షణ కలిగిన నాయకుడని పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశాడని ఆయన కొనియాడారు.అదేవిధంగా భాగ్యనగర్ తండాకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు గుగులోతు మాంగో ఇదే రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడని తెలుసుకొని ఫోన్లో ఆయన కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకుని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమం లో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎర్రబాబు, కె.సారయ్య, ఏపూరి లతా దేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, రావి శివరామకృష్ణ, సిపిఐ నాయకులు బంధం నాగయ్య, ఉంగరాల సుధాకర్, పావినేని సత్యనారాయణ, పుచ్చకాయల శ్రీనివాసరావు, బట్టు సంగయ్య, దల్ సింగ్, పుచ్చకాయలపల్లి శాఖ కార్యదర్శి అమరు, సహాయ కార్యదర్శి రెడ్డిబోయిన రవి, సీనియర్ నాయకులు ఈస్లావత్ అమృ, తదితరులు, పలువురు సిపిఐ కార్యకర్తలు, సానుభూతి పరులు, భౌతికాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

# యోగా మన పురాతన వారసత్వ సంపద..

ఇబ్రహీంపట్నం జూన్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); యోగా మన పురాతన వారసత్వ సంపద అని, ఆత్మను, శరీరాన్ని ఏకం చేసే కార్యం యోగాను పాటిద్దాం అని బువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్య గౌడ్ పిలుపు నిచ్చారు. ఇబ్రహీం పట్నం నియోజకవర్గం తుర్కంజల్ మున్సిపాలిటీలోని శాంతినికేతన్ స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన యువతను, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ శారీరక మానసిక ఒత్తిడిని తగ్గించే యోగాను నిత్యం ఆచరిస్తు ప్రపంచానికి మన సంస్కృతి యొక్క గొప్పతనాన్ని చాటుదామన్నారు."యోగత్ ఆరోగ్యం భవతి"యోగా అనేది మనసు, శరీరం మరియు ఆత్మను సమతుల్యం చేసే దివ్య సాధనం. భగవద్గీతలో శ్రీకృష్ణుడు "సమత్వం యోగ ఉచ్యతే" (2.48) అని, సమతుల్యతే యోగమని ఉపదేశించారు. కర్మ యోగ, జ్ఞాన యోగ, భక్తి యోగ, ధ్యాన యోగల ద్వారా జీవితంలో శాంతి, స్థిరత్వం మరియు ఆరోగ్యాన్ని సాధించవచ్చని గీత సూచిస్తుందన్నారు.

ప్రతిరోజూ యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం సాధన ద్వారా ఒత్తిడిని అధిగమించి, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు. ముఖ్యంగా యువత, విద్యార్థులు ఆరోగ్యం, మానసిక ఏకాగ్రత మరియు ఉన్నత లక్ష్యాల సాధన కోసం యోగాన్ని అలవరచుకోవాలని కోరాను.

# కేజీబీవీలో అక్రమాలు.. ఎమ్మెల్యే, డీఈఓ విచారణ లో వెల్లడి



ఆదిలాబాద్, జూన్ 23: కేజీబీవీలో లో మెనూ పాటించకుండా స్టూడెంట్స్ ను అర్ధకాలితో ఉంచుతూ, ర్యాష్ గా ప్రవర్తిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న స్పెషల్ ఆఫీసర్ తో సిబ్బందిపై స్టూడెంట్స్, పేరెంట్స్ చేసిన ఫిర్యాదుపై డీఈఓ తో కలిసి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సోమవారం దాదాపు మూడు గంటలకు పైగా స్కూల్ లో విచారణ నిర్వహించారు.

ముందుగా స్పెషల్ ఆఫీసర్, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ను విచారించి స్టూడెంట్స్ ను విచారించారు. స్పెషల్ ఆఫీసర్ మంజుల, అసిస్టెంట్ కుక్, వాచ్ విమెన్, స్కావేంజర్ తమ పట్ల ర్యాష్ గా ప్రవర్తిస్తు తమ పట్ల, తమ పేరెంట్స్ పట్ల బూతు మాటలు కూడా అంటున్నారని, తమతోనే టాయిలెట్స్, గ్రౌండ్, వాటర్ ట్యాంక్ తదితర క్లీనింగ్ పనులు చేపిస్తున్నారని విస్తూపోయే విషయాలు చెప్పారు.

ప్రభుత్వ మెనూ ప్రకారం వారంలో మూడు సార్లు ఎగ్స్, రెండు సార్లు చికెన్, కిచిడి పెట్టాల్సి ఉండగా, వంద 50 మంది తినే ఫుడ్ 100 మందికి పైగా వడ్డిస్తున్నారని, అది కూడా కేవలం నీళ్ల చికెన్ సూపు ఒక రోజు, ఒక రోజు ఎగ్స్, నీళ్ల టమాటా, ఉడికి ఉడకని అన్నం వడ్డిస్తుండడంతో అర్ధాకలితో అలమటిస్తున్నామని, దీంతో చదువుకోవడం కూడా ఇబ్బందిగా మారిందని స్టూడెంట్స్ ఆవేదనతో తెలిపారు. విచారణ అనంతరం స్పెషల్ ఆఫీసర్ మంజులతో పాటు వర్కర్స్ భారతి, నీల, లక్ష్మి లను వెంటనే సర్వీస్ రిమూవల్ చేయాలని డీఈఓకు సిఫారస్ చేయడంతో నివేదికను జిల్లా కలెక్టర్ కు పంపిస్తూ బాధ్యులైన సిబ్బందిని స్కూల్ నుంచి వెళ్లిపోవాలని, ఎంఈఓ చిన్నయ్య ను స్కూల్ పర్యవేక్షించమని డీఈఓ యాదయ్య ఆదేశించారు.

# ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ చట్టం పై పార్లమెంట్ లో బిల్లు పెట్టాలి

**–ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక వాదుల "రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్**

హైద్రాబాద్ జూన్ 23 (ఎక్స ప్రెస్ న్యూ స్) ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ చట్టం పై, చర్చ కు పార్లమెంట్ లో బిల్లు తక్షణమే పెట్టాలని పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక వాదులతో గన్ పౌండ్రి సూర్యాలోక్ కాంప్లెక్స్ "రౌండ్ టేబుల్ సమావేశం "జరిగింది ఈ సమావేశంలో, దేశ ప్రధాని నరేంద్ర మోడీకి, తెలంగాణ సిఎం రేవంతరెడ్డికి బహిరంగ లేఖ కరపత్రం విడుదల చేసారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ సాధన వ్యవస్థాపక అధ్యక్షులు జై బాబు మాట్లాడుతూ తెలంగాణలో వలసవాద దోపిడీని అడ్డుకునేందుకు స్థానికత నిరుద్యోగ ఎస్సీ ఎస్టీ బీసీ యువతకు ప్రైవేట్ రంగాలలో రిజర్వేషన్ విద్య రిజర్వేషన్లు విద్యా ఉద్యోగ ఉపాధ్యాధిక రంగాల్లో స్థానిక భూమిపుత్రులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యాచరణతోక్షేత్ర స్థాయికి, కార్యక్రమం, దేశావ్యాప్త ఆందోళనలో బాగంగా తెలంగాణ అన్ని జిల్లాల్లో కార్యక్రమాలు, సమావేశాలు సదస్సులు, ర్యాలీలు సభలు, జరపాలని రూపకల్పన, సమావేశం ద్వారా రూపొందించామన్నారు తెలంగాణ లో, వలస వాద దోపిడీని అడ్డుకునేందుకు, స్థానికత నిరుద్యోగ



ఎస్సి,ఎస్టి,ఓబిసి,యువత కు ప్రైవేట్ రంగాల్లో, విద్య ఉద్యోగ, ఉపాధి ఆర్థిక రంగాల్లో 371ఆర్టికల్ ద్వారా రాష్ట్రాలకు అవకాశల్లో రక్షణలు కల్పించే అవకాశం ఉన్నందున,స్థానిక భూమి పుత్రులకు, జార్ఖండ్,హర్యానా, మధ్యప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు ప్రైయివేట్ రంగంలో స్థానికులకు 75%రిజర్వేషన్ లు కల్పించాయని అదే వరుసలో తెలంగాణ, యుపి, బీహార్ రాష్ట్రాలు ఉన్నాయని అన్నారు, తెలంగాణాలో ఎన్నికల ముందు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ చట్టం తెస్తామని ఇచ్చిన హామీని రేవంత్ రెడ్డి నిలుపుకోవాలని వక్తలు మాట్లాడారు, అలానే ప్రభుత్వ రంగాన్ని ప్రైవేట్ రంగాన్ని బ్యాలన్స్ చేసి, పార్లమెంట్ నుండి చట్టం వచ్చేలా కాంగ్రెస్, బీజేపీ ఎంపీలతో మాట్లాడి పౌర సమాజ పక్షంగా బిల్లు పై పోరడాలని, తెలంగాణ అస్థిత్వాన్ని తెలంగాణ విద్యార్థి, యువత మూడింట రెండువంతులమంది, ప్రైవేట్ రిజర్వేషన్ చట్టం కోరుకొంటున్నారన్నారు. .హర్యానా కోర్టు స్వేచ్ఛ సమానత్వలకు విగాతం కల్పిస్తుందని హర్యానా రాష్ట్రం కల్పించిన ప్రైవేట్ రిజర్వేషన్ చట్టం నిలుపుదలచేసిందని ఎలాంటి రాజ్యాంగ ఉల్లంగణలు లేకుండా చట్ట పరమైన చర్యలుతో పార్లమెంట్ నుండిప్రై వేట్ రిజర్వేషన్ బిల్లు సాధించే బాధ్యత సిఎం తీసుకోవాలని కోరారు.,ప్రైవేట్ విద్యా సంస్థల్లో సుప్రీం కోర్టు 25%రిజర్వేషన్ కల్పించాలని ఇచ్చిన తీర్పు ఈ ఏడాది నుండే అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఐపిసి పార్టీ అధ్యక్షులు కేబీ శ్రీధర్ , చిత్ర ,అంజలి దేవి, సర్వరాజ్ తదితరులు పాల్గొన్నారు




# హర్మూజ్ జలసంధి మూసివేత..!

## –ప్రపంచ ఆయిల్ మార్కెట్‌పై ప్రభావం తప్పదా!!

ఇరాన్ జూన్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అమెరికా దాడికి నిరసనగా హర్మూజ్ జలసంధిని మూసివేసేందుకు ఇరాన్ పార్లమెంట్ ఆమోదం తెలిపింది. అయితే, తుది నిర్ణయానికి అత్యున్నత భద్రతా సంస్థ ఆమోదం అవసరం. పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే ఈ ఇరుకైన మార్గం ద్వారా ప్రపంచంలో పెద్ద చమురు వ్యాపారం జరుగుతుంది. అలాంటి దీన్ని మూసివేస్తే ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరగనున్నాయి. ఈ మార్గాన్ని ఇరాన్ మూసివేయకుండా ఆపాలని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో చైనాను కోరారు. అయితే, భారత్‌లో కొన్ని వారాల పాటు ఇంధన అవసరాలు తీర్చేందుకు తగినంత చమురు అందుబాటులో ఉన్నది. భారత్ అనేక మార్గాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటుందని పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి అన్నారు. భారతదేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు కాగా.. గ్యాస్ దిగుమతిలో నాలుగో స్థానంలో ఉన్నది. ప్రభుత్వం రెండు వారాలుగా పశ్చిమాసియా పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని.. ప్రధాని మోదీ నాయకత్వంలో గత కొన్ని సంవత్సరాలుగా సరఫరాను వైవిధ్యంలో తీసుకువచ్చామని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ పేర్కొన్నారు. ఇప్పుడు హర్మూజ్ జలసంధి నుంచి ఎక్కువగా తీసుకురావడం లేదని పేర్కొన్నారు. భారత్ మొత్తం రోజుకు 55లక్షల బ్యారెల్స్ చమురు దిగుమతి (ఃఖఅ)లో దాదాపు 20 లక్షల బ్యారెల్స్ మాత్రమే ఈ జలసంధి ద్వారా వస్తున్నది. అయితే, గతకొన్ని సంవత్సరాలుగా రష్యా, అమెరికా, బ్రెజిల్ తదితర దేశాల నుంచి చమురు సరఫరాను పెంచింది.

### రష్యా నుంచి వచ్చే చమురు హర్మూజ్ ద్వారా రాదు..

రష్యా నుంచి వచ్చే చమురు హర్మూజ్ మార్గం ద్వారా రాదు. ఇది సూయజ్ కాలువ.. కేప్ ఆఫ్ గుడ్ హోప్.. పసిఫిక్ మహాసముద్రం ద్వారా వస్తుంది. యూఎస్, పశ్చిమ ఆఫ్రికా, లాటిన్ అమెరికా నుంచి సరఫరా ఖరీదైనప్పటికీ ఆచరణీయమైన ఎంపికగా మారాయని.. ఇంధన సరఫరా స్థిరత్వాన్ని నిర్ధారించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి తెలిపారు.

### భారతదేశ ఇంధన భద్రత..

జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలోని జాతీయ భద్రతా అధ్యయనాల ప్రత్యేక కేంద్రంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణ్ కుమార్ బెహెరా మాట్లాడుతూ.. ఈ ఇరుకైన మార్గాన్ని మూసివేయడం ప్రపంచవ్యాప్తంగా ఇంధన మార్కెట్లపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని, భారతదేశ ఇంధన భద్రతను కూడా ప్రభావితం చేస్తుందని అన్నారు. భౌగోళిక రాజకీయ సంక్షోభానికి దారితీసే ఈ ముఖ్యమైన షిప్పింగ్ మార్గంలో ఏదైనా అంతరాయం ఇరాక్, కొంతవరకు సౌదీ అరేబియా, భారతదేశం ముడి చమురు దిగుమతులను ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు.

### పెరగనున్న బీమా ప్రీమియంలు..

గల్ఫ్ ప్రాంతంలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్న భారత నావికాదళ మాజీ ప్రతినిధి కెప్టెన్ డీకే శర్మ (రిటైర్డ్), హార్మూజ్ జలసంధిని మూసివేస్తామన్న హెచ్చరికలు ఇరాన్ ప్రపంచ చమురు వాణిజ్యానికి గణనీయమైన అంతరాయం కలిగిస్తుందని అన్నారు. షిప్పింగ్‌లో ఏదైనా అంతరాయం బీమా ప్రీమియంలపై ప్రభావం చూపుతుందని, చమురు రవాణా మరింత ఖరీదవుతుం దని పేర్కొన్నారు.

### చమురు ధరలు పెరుగుతుందనే భయం

ఈ ప్రాంతంలో పెరుగుతున్న ఉద్రిక్తత కారణంగా చమురు ధరలు ఇప్పటికే పెరిగే అవకాశం ఉందని శర్మ అన్నారు. ఇలాంటి పరిస్థితిలో ఇరాన్ ప్రతీకారం తీర్చుకుంటే.. ధరలు బ్యారెల్‌కు 80–90 నుంచి వంద బ్యారెల్‌కు వంద డాలర్లకు చేరుకోవచ్చని అంచనా. ప్రాంతీయ దేశాల కరెన్సీ అస్థిరత.. పెట్టుబడదారులు ఇతర స్థిరమైన మార్కెట్ల వైపు మొగ్గు చూపవచ్చని.. ఆర్థిక వృద్ధిపై ప్రభావం చూపుతుందని కూడా ఆయన అన్నారు.

### ఇరాన్ చాలా నష్టపోతుంది: రూబిన్

హర్మూజ్ మార్గాన్ని మూసివేస్తే ఇరాన్ చాలా నష్టపోతుందని యూఎస్ డిఫెన్స్ హెడ్‌క్వార్టర్స్ పెంటగాన్ మాజీ అధికారి మైఖేల్ రూబిన్ అన్నారు. ఆసియాకు వెళ్లే చమురులో 44 శాతం ఈ మార్గం గుండానే వెళుతుందని ఆయన అన్నారు. ఇందులో ఎక్కువ భాగం చైనాకే వెళుతుందని ఆయన అన్నారు. ఇరాన్ హార్మూజ్ మార్గాన్ని మూసివేయడానికి ప్రయత్నిస్తే.. అమెరికా ప్రతిస్పందన ఇస్తుందని అమెరికన్ ఉగ్రవాద ఆర్థిక విశ్లేషకుడు జోనాథన్ స్కాంజర్ అన్నారు. బ్రిటన్, ఫ్రాన్స్ నుంచి మద్దతు ఇస్తాయని.. ఇరాన్ చర్య ఆత్మహత్యా సదృశ్యమేనని పేర్కొంటున్నారు.

### పశ్చిమాసియాతో భారతదేశం వాణిజ్యంపై ప్రభావం

యుద్ధం తీవ్రతరం కావడం ఇరాక్, జోర్డాన్, లెబనాన్, సిరియా, యెమెన్ వంటి పశ్చిమాసియా దేశాలతో భారతదేశం వాణిజ్యంపై భారీ ప్రభావాన్ని చూపుతుంది. భారతదేశం వారికి 8.6 బిలియన్ డాలర్లు ఎగుమతి చేస్తుంది. 33.1 బిలియన్ల డాలర్లు దిగుమతి చేస్తుంది. హర్మూజ్ మార్గాన్ని మూసివేయడం వల్ల సరుకు రవాణా కూడా పెరుగుతుంది. ముడి చమురును మోసుకెళ్లే ప్రతి నాల్గవ నౌక ఇక్కడి నుంచే వస్తుంది. ప్రపంచంలోని రోజువారీ చమురు సరఫరాలో 30శాతం ఇక్కడి నుంచే వస్తుంది.

# మధిరలో కూలీలకు దుస్తుల పంపిణీ

ఖమ్మం, జూన్ 23:: మహాత్మాగాంధీ ఓల్డ్ క్లాత్ బ్యాంక్ ద్వారా సామాజిక సేవకుడు లంక కొండయ్య సోమవారం కూలీలకు దుస్తులు అందజేశారు. రాజమండ్రి నుంచి మధిరలో కాల్వల పూడికలు తీయడానికి కూలీలు వచ్చారు. ఆ కూలీలకు లంక కొండయ్య మహాత్మాగాంధీ ఓల్డ్ క్లాత్ బ్యాంక్ ద్వారా సేకరించిన పాత బట్టలను పంపిణీ చేయడంపై పట్టణానికి చెందిన ప్రముఖులు అభినందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, షేక్ జహంగీర్, మైలవరపు చక్రి మాట్లాడుతూ.. కొండయ్య మధిర పట్టణంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎయిడ్స్, కరోనాపై ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. ఎన్నో అవార్డులు పొందిన ఆయన నిరుపేదలకు పాత బట్టలు సేకరించి అందజేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.

# 27న అఖండ గోదావరి ప్రాజెక్ట్ కు శంకుస్థాపన



అమరావతి, జూన్ 23: టూరిజం కేంద్రాల అభివృద్ధిలో భాగంగా ఏపీ ప్రభుత్వం గోదావరి తీర ప్రాంతంలో అఖండ గోదావరి ప్రాజెక్ట్ కు శ్రీకారం చుట్టనుంది. రూ.97.44 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్ట్ కు ఈనెల 27వ తేదిన కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ లు రాజమహేంద్రవరంలో శంకుస్థాపన చేయనున్నారు. చిరకాల వాంఛగా ఉన్న అఖండ గోదావరి ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను తాజాగా ఏపీ టూరిజం మంత్రి కందుల దుర్గేష్ ఇవాళ రాజమండ్రిలో వెల్లడించారు. 127 సంవత్సరాల రాజమండ్రి హ్యావ్ లాక్ వంతెన పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు.

రూ.97 కోట్ల 44 లక్షల అంచనాలతో అఖండ గోదావరి ప్రాజెక్టుకు సిద్ధం కానున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ఈ ఏడాది ఏపీలో టూరిజం అభివృద్ధి 375 కోట్ల రూపాయల పనులు మంజూరు చేయించుకున్నామన్నారు. ఇకపోతే అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు ద్వారా రాజమహేంద్రవరం నగరం, గోదావరి పర్యాటక ప్రాంతాలకు కొత్త రానున్నాయి. రాష్ట్రాన్ని మరింత పర్యాటక ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దే లక్ష్యంగా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆయన అన్నారు.

ఈ నిధులు స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్ మెంట్ పథకం ద్వారా మంజూరయ్యాయి. ఈ రూ.97 కోట్లతో రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కడియం, కొవ్వూరు, నిడదవోలు వంటి ఇతర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి పనులు శరవేంగంగా జరగనున్నాయి. రాబోయే పుష్కరాల లోపే ఈ ప్రాజెక్టును పూర్తి చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగనుంది.

# 'వైరా-మధిర ప్రధాన రహదారి మరమ్మతులు వెంటనే చేపట్టాలి'

ఖమ్మం, జూన్ 23: బోనకల్లు మండల పరిధిలోని వైరా–మధిర ప్రధాన రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజావాణిలో తాసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైరా–మధిర ప్రధాన రహదారిపై బోనకల్లు క్రాస్ రోడ్డు, రాపల్లి స్టేజీ, బ్రాహ్మణపల్లి, కలకోటల వద్ద రోడ్డు అధ్వాన్నంగా తయారైందన్నారు. దీనివల్ల వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు.

రోడ్డుపై పెద్ద గుంటలు పడడంతో అత్యవసర సమయాల్లో అంబులెన్స్ లో రోగులను మధిర, ఖమ్మం ప్రాంతాలకు చేర్చడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. రోడ్డు దెబ్బతిని గుంటలు పడ్డ ప్రదేశాల్లో వర్షపు నీరు చేరి ప్రమాదంగా మారాయన్నారు. ఇప్పటికైనా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టి సారించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సమితి సభ్యులు కొంగర భాస్కరరావు, గుంపుల జయరాజు, జి కృష్ణారావు పాల్గొన్నారు.

# "భక్తర్గళ్ మానాడు" లో అవకాశం.. అందరికీ థ్యాంక్స్ చెప్పిన పవన్ కల్యాణ్



అమరావతి, జూన్ 23:మధుర మీనాక్షి అమ్మవారి పవిత్రమైన భూమి మధురైకి, అలాగే శక్తి స్వరూపుడు మురుగన్ నేల తమిళనాడు మట్టికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్. మధురైలో ఆదివారం నాడు నిర్వహించిన మురుగ భక్తర్గళ్ మానాడులో ఆయన పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత పవన్ కళ్యాణ్ కార్యక్రమం సంబంధించి సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేసారు. మీరు చూపిన ప్రేమ, భక్తి నాకు అపూర్వ అనుభూతిని కలిగించాయని.. ఈ పవిత్ర భూమి, ఇక్కడి ప్రజలు ధార్మిక భారతదేశ జీవరూపమే అని అన్నారు.

అలాగే "మురుగన్ భక్తర్గళ్ మానాడు" కార్యక్రమానికి అత్యంత భక్తి శ్రద్ధలతో హాజరైన ప్రతి భక్తుడికీ నా కృతజ్ఞతలు. ఈ సమ్మేళనంలో మీ అందరి ఉనికి ఒక దైవానుగ్రహంగా భావించాలి. ఈ భూమి ధర్మపథాన్ని ముందుకు తీసుకెళ్తున్న ఆదర్శ ప్రదేశంగా నిలిచిందని అన్నారు. ఈ ఘన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ముఖ్యంగా తమిళనాడు అధ్యక్షులు తిరు కడేశ్వర సుబ్రహ్మణ్యం అవర్గళ్, బీజేపీ తమిళనాడు అధ్యక్షులు తిరు నైనార్ నాగేంద్రన్ అవర్గళ్, మాజీ అధ్యక్షుడు తిరు అన్నామలై అవర్గళ్, కేంద్ర మంత్రి తిరు ఎల్. మురుగన్ అవర్గళ్, మాజీ తెలంగాణ గవర్నర్ డా. తమిళిసై సౌందరరాజన్ అవర్గళ్, సీనియర్ రాజకీయ నాయకుడు తిరు కే.ఎస్. రాధాకృష్ణన్ అవర్గళ్, అలాగే ఈ కార్యక్రమానికి హాజరైన అన్ని మత గురువులు, సన్యాసులు, ఇతర గౌరవనీయ అతిథులు, భక్తులకు నా హృదయపూర్వక నమస్సులంటూ పేర్కొన్నారు.

# నిరుపేద విద్యార్థినికి 'జాంబవవారసులం' ఆర్థిక చేయూత

## – అభినందించిన సోషల్ వెల్ఫేర్ డిడి కస్తాల సత్యనారాయణ




ఖమ్మం, జూన్ 23 (నేటినిజం ప్రతినిధి) : ఎన్ఐటి దుర్గాపూర్ పచ్చిమబెంగాల్ లో చదుతున్న నిరుపేద విద్యార్థినికి 'జాంబవవారసులం' గ్రూపు సభ్యులు మానవత్వంతో ఆర్థికసాయం అందజేసి ఆదుకోవడం అభినందనీయమని సోషల్ వెల్ఫేర్ డిడి కస్తాల సత్యనారాయణ అన్నారు. ఖమ్మం జిల్లా, వైరా మండలం పుణ్యపురం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన చెరుకూరి సాంబమూర్తి–లలిత దంపతుల కుమార్తె చెరుకూరి నివేదిత పచ్చిమబెంగాల్ లోని ఎన్ఐటి దుర్గాపూర్ లో ప్రస్తుతం బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది, ఫైనల్ ఇయర్ కాలేజి ఫీజు కొరకు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న 'జాంబవవారసులం' గ్రూపు సభ్యులు అందరూ కలిసి సమకూర్చిన 53,500/–రూపాయలను సోమవారం ఖమ్మంలోని అంబేద్కర్ భవన్ లో ఖమ్మం జిల్లా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ చేతులమీదుగా విద్యార్థిని నివేదితకు అందించటం జరిగింది. ఈ సందర్భంగా నివేదిత కుటుంబ సభ్యులు జాంబవవారసులం గ్రూపు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పేద విద్యార్థిని చదువుకోవడానికి ఆర్థికసాయం అందించిన జాంబవవారసులం గ్రూపు సభ్యులను డిడి కస్తాల సత్యనారాయణ అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రూపు సభ్యులు కిన్నెర వెంకటేశ్వర్లు, పేరెల్లి శ్రీను, బొజ్జ గంగన్న, గుండ్ల రవి, మరికంటి కన్నారావు, ఆరెంపుల అంబేద్కర్, పెనుగూరి కోటేశ్వరరావు, చేకూరి చైతన్య, పల్లెపోగు కృష్ణ, బొబ్బిలి భరత్ చంద్ర, నెమలి కిశోర్, శ్రీను, సుదర్శన్, పరిమళ రాము, మహేష్, తిరుమలరావు, కోటి, రామకృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# మధిర మున్సిపాలిటీలో కనీస సౌకర్యాలు కల్పించాలి : గోపాలరావు

ఖమ్మం, జూన్ 23:మధిర మున్సిపాలిటీలో కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఎం పార్టీ డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు అన్నారు. సోమవారం మధిర స్థానిక బోడెపూడి భవనం నందు మధిర పట్టణ కమిటీ, శాఖ కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తల సమావేశం మండవ ఫణీంద్ర కుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మడిపల్లి గోపాలరావు మాట్లాడుతూ.. మధిర మున్సిపాలిటీలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పేద ప్రజలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు ఇవ్వడంలో ఈ ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు పరచడంలో పూర్తిగా వైఫల్యం చెందినట్లు తెలిపారు.

మధిరలో కోట్ల రూపాయలతో వంద పడకల ఆస్పత్రిని నిర్మించి దానిని ప్రారంభించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. మధిర నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న కాలంలో మాత్రమే పేదలకు ఇండ్ల స్థలాలు, రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. మధిర నియోజకవర్గంలో పేద ప్రజల సమస్యలపై సీపీఎం పార్టీ ఎప్పటికీ పోరాడుతూనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి పడకండి మురళి, జిల్లా కమిటీ సభ్యుడు శీలం నరసింహారావు, పట్టణ కమిటీ సభ్యులు పావినేని రామ నరసయ్య, పుచ్చకాయల కిశోర్, ఫాతిమా బేగం, నాయకులు పెంటి వెంకటరావు, సిద్దావలి, తేలపోలు రాధాకృష్ణ, వెంకట్రావు పాల్గొన్నారు.



# బీడీ కార్మికుల ప్లాట్ల అక్రమ రిజిస్ట్రేషన్లను ఆపాలి : తహసీల్దార్‌కు లబ్ధిదారుల వినతిపత్రం

మెదక్, జూన్ 23: బీడీ కార్మికులకు కేటాయించిన ప్లాట్లను కొంత మంది అక్రమార్కులు కావాలనే అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని అలాంటి రిజిస్ట్రేషన్లను ఆపాలని లబ్దిదారులు, యాదవ సంఘం నాయకులు తహసీల్దార్ రజినీకుమారిని కోరారు.

సోమవారం ప్రజావాణిలో భాగంగా రామాయంపేట తహసీల్దార్ కార్యాలయానికి బీడీ కార్మిక లబ్దిదారులు తరలివెల్లి వినతి పత్రం అందజేశారు. రామాయంపేట పట్టణంలో గత కొన్నేండ్ల క్రితం బీడీలు చేసే వారికి ప్లాట్లను ఇవ్వడం జరిగిందని వాటిని కావాలనే పట్టణంలోని ఓ వ్యక్తి గుట్టు చప్పుడు గాకుండా రిజిస్ట్రేషన్లు చేసుకోవడం జరిగిందన్నారు.

తక్షణమే వాటిని సర్వేలు చేసి లబ్దిదారులకు అట్టి ప్లాట్లను అప్పగించాలని కోరారు.

లేకుంటే లబ్దిదారులతో ఆందోళన చేపడ్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజు యాదవ్, తాడెం మల్లయ్య, గొల్ల రమేశ్, స్వామిలు ఉన్నారు.

# అధికారులు జవాబుదారీగా పని చేయాలి..

## ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, జూన్ 23: అధికారులు జవాబుదారుగా విధులు నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. మెదక్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో ప్రజల నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీ ఆర్డిఓ పీడీ శ్రీనివాసరావు, సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పెండింగ్ దరఖాస్తులపై శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 119 దరఖాస్తులు వచ్చాయని, వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు ఎండార్స్‌మెంట్ చేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను కూలంకషంగా పరిశీలించి, పెండింగ్‌లో ఉంచకుండా, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆయా శాఖలకు వచ్చిన దరఖాస్తులు రెవెన్యూ భూ సమస్యలకు సంబంధించి–50, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు 20, పింఛన్లు –03, ఎంప్లాయిమెంట్ –05, ఇతర సమస్యలు –41 మొత్తం 119 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. ఈ ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మారం మండలంలో పలు పాఠశాలలను తనిఖీ చేసిన డీఈఓ మాధవి

కరీంనగర్, జూన్ 23:పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని పలు గ్రామాలలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలను సోమవారం జిల్లా విద్యాధికారి మాధవి తనిఖీ చేశారు. ధర్మారంలోని బ్రిలియంట్ కిడ్జ్ పాఠశాలను సందర్శించి పలు రికార్డులను ఆమె ఈ సందర్భంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన పాఠశాల పత్రాలను ఆమె తనిఖీ చేసి పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించి విద్యా బోధన విధానాలను, ఎఫ్ఎల్ఎన్ నిర్వహణ తీరు, ఏకరూప దుస్తులుపాఠ్యపుస్తకాల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు.

ఉపాధ్యాయుల బోధనను పరిశీలించి నమోదు చేసుకున్నారు. విద్యార్థులను పరీక్షించారు. నల్లలింగయ్యపల్లి ప్రాథమిక పాఠశాలను డీఈవో సందర్శించగా ఆ పాఠశాల విద్యార్థులు ఆలపించిన అభినయ గీతాలను, వర్ణమాల తోరణాలను చూసి ఉపాధ్యాయులను ఆమె ప్రశంసించారు. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని మరింత మెరుగుపరచడానికి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. పిల్లలతో తప్పకుండా కథల పుస్తకాలు చదివించాలని లైబ్రరీ పీరియడ్ అన్ని పాఠశాలలో తప్పక నిర్వహించాలని ఆమె సూచించారు .బాగా చదివే పిల్లలను వెనుకబడిన పిల్లలతో కలిపి గ్రూపులుగా విభజించి చదివించాలని సూచించారు. ఆమె వెంట విద్యాధికారి పి. ప్రభాకర్, సీఆర్పీలు కె. కవిత, బి. కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# యూసుఫ్ గూడలో ఒలింపిక్ డే రన్



హైదరాబాద్, జూన్ 23: తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో 39 వ ఒలింపిక్ డే రన్ నిర్వహించారు. సోమవారం యూసుఫ్ గూడా కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర త్రో బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. నవీన్ యాదవ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

వేగంగా.. ఉన్నతంగా.. బలంగా.. కలిసి కట్టుగా అనే థీమ్ తో నిర్వహించిన ఈ రన్ యువ క్రీడాకారుల్లో ఒలింపిక్ స్ఫూర్తిని రగిలించి సమాజంలో క్రీడా అవగాహనను పెంపొందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడా ప్రముఖులతో పాటు విల్లా మేరీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# బజార్ హత్నూర్‌లో ఎస్‌బీఐ బ్యాంకుని ఏర్పాటు చేయాలి



హైదరాబాద్, జూన్ 23: బజార్ హత్నూర్ మండల కేంద్రంలో ఎస్‌బీఐ బ్యాంకుని ఏర్పాటు చేయాలని సోమవారం ప్రజావాణిలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆధ్వర్యంలో కొనసాగిన ప్రజావాణిలో లీడ్ బ్యాంకు మేనేజర్ ను కలిసి బజార్ హత్నూర్ మండల ప్రజలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బజార్ హత్నూర్ మండలంలో నూతనంగా ఎస్‌బీఐ బ్యాంకు మంజూరు చెయ్యాలని నిత్యం ఖాతాదారులు పెరుగడంతో పాటు సరైన బ్యాంకు సేవలు అందిచడంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు విఫలం కావడంతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదురుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

అంతే కాకుండా ఇచ్చోడ, బోథ్, ఆదిలాబాద్ వంటి పట్టణాల్లో ఉన్న ఎస్‌బీఐతో పాటు ఇతర బ్యాంకు సేవలను మండల ప్రజలు ఉపయోగించుకుంటున్నారు. దీంతో దూర భారంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అదే బజార్ హత్నూర్ మండల కేంద్రంలో బ్యాంకు ఉంటే ప్రజలకు అన్నివిధాలుగా సౌకర్యంగా ఉంటుంది అని పేర్కొన్నారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఒఆట విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరచ సాయన్న, లక్కం శంకర్, డబ్బులు చంద్ర శేఖర్, బత్తిని మురళి కృష్ణ, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

# ఒలంపిక్ క్రీడల ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు అల్ఫోర్స్ సంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి

కరీంనగర్, జూన్ 23:(నేటినిజం ప్రతినిధి) ఒలంపిక్ క్రీడలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉన్నదని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో స్ఫూర్తిదాయకంగా నిర్వహింపబడినటువంటి అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి క్రీడా జ్యోతిని వెలిగించి పతాకావిష్కరణ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒలంపిక్ క్రీడలు చాలా పురాతనమైనవని మరియు ఈ క్రీడల ద్వారా వివిధ దేశాల వట్ల సత్సంబందాలు కొనసాగుతున్నాయని వివిధ దేశాల మధ్య వైరం ఉన్నప్పటికి ఈ క్రీడల ద్వార సమసిపోతుందని మరియు శాంతి స్థాపనకు మార్గం సఖమం అవుతుందని తెలుపుతూ క్రీడల ద్వారా దేశ ఔనత్యాన్ని పెంపొందించడవే కాకుండా ఆర్థికంగా దేశానికి వనరులు పెరుగుతాయని ముఖ్యంగా ప్రజల యొక్క తలసరి ఆదాయం సైతం పెరుగుతుందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని చెప్పారు. మన దేశంలో భారతదేశ ప్రభుత్వం వారు అనేక సదుపాయాలతో పాటు పారితోషకాలను సైతం ఇస్తున్నదని వీటన్నింటిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకున్నట్లైతే క్రీడలలో అగ్రగామిగా ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. పురాతన కాలంలో ప్రారంభమైన ఈ క్రీడ నేటికి వన్నె తగ్గకుండా ప్రతి సంవత్సరం రెట్టింపు ఉత్సాహంతో నన్నాహకంగా నిర్వహిస్తు లోటుపాట్లను సరిచేసుకుంటు ఉత్తమంగా పాల్గొంటున్నారని కొనియాడారు.

భారతదేశంలో భారత్ ఒలంపిక్ సంఘం వారి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని మరియు ప్రోత్సహాకాలను అందజేయడం శుభ పరిణామమని తెలిపారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధానంగా క్రీడల్లో జరిగే లాభాలు మరియు ఏ ఇతర వాటిలో ఉండవని తెలిపిన నృత్యప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అద్భుత ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు పారితోషకాలను అందజేసి అభినందిస్తూ భవిష్యత్తుల్లో పలు క్రీడా పోటీలలో పాల్గొని క్రీడా స్ఫూర్తి చాటాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల జీతాలు వెంటనే చెల్లించాలి...

## -రెండు నెలల జీతాలు వెంటనే చెల్లించకపోతే భార్య పిల్లలతో కలిసి నిరాహార దీక్ష చేపడతాం.


## - ఆయుష్ వైద్యుల సంఘం ఆవేదన.



కరీంనగర్, జూన్ 23:(నేటినిజం ప్రతినిధి) కాంట్రాక్ట్ బేస్ ఉద్యోగాలతో, అరకోర జీతాలు కూడా సమయానికి ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పుట్టెడు చాకిరి చేస్తున్న, శ్రమకు తగిన వేతనం ఇవ్వకపోవడం, జీతాలు సమయానికి అందించకపోవడం దారుణమని, ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల జీతాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ ఎన్ ఆర్ హెచ్ ఏం ఆయుష్ వైద్యుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రోజున ఎన్ హెచ్ ఎం నాయకులు మీడియా తో మాట్లాడుతూ గత మే నెలలో అందాల్సిన జీతం ఇవ్వలేదని, ఈ నెల అటెండెన్స్ కూడా పంపించామని, ఇంకో వారం రోజులు అయితే జూన్ నెల వస్తుందని, పిల్లల పాఠశాలలు మొదలవుతాయని, జీతాలు సమయానికి ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, బాధలు పడుతున్నామని లోగడ మంత్రులు, నాయకులు, ఉన్నత అధికారులకు మొరపెట్టుకున్న కనికరం లేకుండా పోయిందన్నారు. రేపు మాపు అంటూ అందించే జీతాలపై దాటవేత ధోరణి అనుసరిస్తున్నారని, ఖచ్చితంగా జీతాలు ఎప్పుడు వస్తాయో చెప్పడం లేదన్నారు. ఇప్పటికైనా తమ ఉద్యోగుల జీతాలు వెంటనే చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం అందించి మమ్మల్ని శ్రమ దోపిడి నుంచి విముక్తుల్ని చేయాలని కోరారు.

జీతాల మీద ఆధారపడిన ఉద్యోగుల జీవితాలను రోడ్డున పడే విధంగా చేయవద్దని ప్రాధేయపడ్డారు. రాబోయే జూలై నెల ఒకటో తేదీ వరకు మే, జూన్ రెండు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని, లేని యెడల ఎన్ హెచ్ ఎం ఆఫీసు ముందు ఉద్యోగుల భార్యా పిల్లలతో కలసి నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయుష్ అసోసియేషన్ అధ్యక్షులు డా.క్రాంతి కుమార్, ఉపాధ్యక్షులు డా.రాజమోహన్, డా.వెంకట స్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.ప్రభాకర్, డా. శాంత కుమార్, డా.రాజేందర్, డా. సబిత, డా. భార్గవి, డా. మృదంల,డా.హర్ష పాల్గొన్నారు.

# బల్కంపేట ఎల్లమ్మకు ఎమ్మెల్యే తలసాని ప్రత్యేక పూజలు



హైదరాబాద్, జూన్ 23:బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బల్కంపేట ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు పదేళ్లపాటు అమ్మవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. తెలంగాణ పద్మశాలి సంఘం నాయకులు జయరాజ్ ఆధ్వర్యంలో కల్యాణోత్సవానికి సంబంధించి ప్రతిఏటా సమర్పించే పోచంపల్లి పట్టు వస్త్రాలైన మూడు చీరలను మగ్గంపై తయారు చేసే పనులను ఎమ్మెల్యే తలసాని ఆదివారం దేవాలయ ఆవరణలో పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు.. కల్యాణోత్సవ ఏర్పాట్లకు సంబంధించి కల్యాణ టికెట్లు, డోనర్ పాసుల సంఖ్యను గణనీయంగా కు దించిన అంశాలను తలసాని దృష్టికి తీసుకువచ్చారు.

కల్యాణోత్సవానికి భక్తుల తాకిడి పెరుగుతోందని, ప్రభుత్వం అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలి తప్ప, భక్తులను నియంత్రించే పనులు చేయవద్దని ఎమ్మెల్యే తలసాని కోరారు. బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారికి జులై 2 వ తేదీన పాత బస్తీకి చెందిన ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో బం గారు బోనం సమర్పిస్తారని ఎమ్మెల్యే తలసాని తెలిపారు. సుమారు 500 మంది వివిధ దేవాలయాలకు చెందిన కమిటీ ప్రతినిధులు అమ్మవారికి బోనం సమర్పించే కార్యక్రమం లో పాల్గొంటారని చెప్పారు. మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఈవో మహేందర్ గౌడ్, సూపరింటెండెంట్ హైమవతి, హన్మంతరావు, అశోక్ యాదవ్, సంతోష్ కుమార్, నర్సింహ, బలరాం, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్, జయరాజ్ పాల్గొన్నారు.

# రేషన్‌కార్డు లబ్ధిదారుల ఎంపికపై అవగాహన

హైదరాబాద్, జూన్ 23: ప్రజాపాలనలో కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు పెట్టుకున్న అభ్యర్థులను లబ్ధిదారులుగా ఎంపిక చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం కేశంపేట తహసీల్దార్ ఆజం అలీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ఆవరణలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, డీలర్లతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలను అందజేసి మాటాడారు. మండలానికి 2600కొత్త రేషన్‌కార్డులు మంజూరయ్యాయని, అయితే ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు గతంలో తమ కుటుంబ సభ్యులకు ఉన్న రేషన్‌కార్డులో నమోదై ఉన్నారన్నారు. కొత్త కార్డు కావాలంటే పాత రేషన్‌కార్డులో పేరును తొలగించాల్సి వస్తుందని, ఈ విషయమై లబ్ధిదారుల అభిప్రాయ ంతోపాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు నెంబర్‌ను యాప్‌లో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిష్టయ్య, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

# రైతు భరోసా ఇచ్చేవరకు తగ్గేదేలే.. గ్రామపంచాయతీ ముందు రైతులు, బీఆర్ఎస్ నాయకుల ధర్నా

హైదరాబాద్, జూన్ 23:రైతులందరికి రైతు భరోసా ఇచ్చేవరకు పోరాటాలు నిర్వహిస్తామని ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు, ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ కృపేష్, సహకార సంఘం ఛైర్మన్ మహేందర్‌రెడ్డిలు అన్నారు.

సోమవారం ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామంలో శివారు ప్రాంతాల్లోని అన్ని గ్రామాల్లోని రైతులకు రైతుభరోసా వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎలిమినేడు గ్రామపంచాయతీ కార్యాలయం ముందు సీఎం దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన రైతులందరికి రైతుభరోసా సాయం అందించారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తిగా కొన్ని మండలాల్లో రైతు భరోసాకు కోత విధించటం సరైన పద్దతి కాదని హెచ్చరించారు. అర్హులైన రైతులందరికి రైతుభరోసా అందించే వరకు బీఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

ఎన్నికల సమయంలో కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి కుర్చీలో కూర్చున్న తర్వాత ఇచ్చిన వాగ్దానాలన్నీ గాలి కొదిలేసి పేద ప్రజలు, రైతుల జీవితాలతో చలగాటమాడుతున్నారని అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా రైతుభరోసా అందించే వరకు ఉద్యమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

రైతుభరోసా సాయం అందించే వరకు గ్రామగ్రామాన ఉద్యమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ రైతు మొద్దు అంజిరెడ్డి, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్, బీఆర్ఎస్ నాయకులు రాంరెడ్డి, శేఖర్‌గౌడ్‌తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నకిలీ కరెన్సీ మార్చేందుకు యత్నం..నిందితుడు అరెస్ట్

హైదరాబాద్, జూన్ 23: సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో నకిలీ కరెన్సీని కమిషన్ పద్ధతిపై మార్చేందుకు ప్రయత్నిస్తున్న ఓ వ్యక్తిని బాచుపల్లి పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.15 లక్షల విలువచేసే నకిలీ కరెన్సీని(500 రూపాయల నోట్లు) స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం? ఏపీ, తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రికి చెందిన పత్తిపాటి ప్రేమ్ చంద్(28)కు, మహారాష్ట్ర పూణెకు చెందిన రాకేశ్‌తో పరిచయం ఉంది.

సులభంగా డబ్బు సంపాదించాలనే మార్గం కోసం వెతుకుతున్న ప్రేమ్‌చంద్‌కు దొంగనోట్లు చలామణి చేయాలని రాకేశ్ సూచించాడు. దీనికి పెద్ద మొత్తంలో కమిషన్ లభిస్తుందని తెలవడంతో ప్రేమ్‌చంద్ అంగీకరించాడు. ఈ నేపథ్యంలో ఈనెల 20న పూణె నుంచి రాకేశ్ రూ.15లక్షల నకిలీ కరెన్సీని ఓ బ్యాగులో పెట్టి ప్రైవేట్ బస్సులో పఠాన్‌చెరుకు పార్సిల్ పంపించాడు. దానిని తీసుకువెళ్లి నిజాంపేట్‌లోని సీఎంఆర్ షాపింగ్ మాల్ సమీపంలో ఓ వ్యక్తికి అందజేయాలని సూచించాడు. కరెన్సీని ఎవరికి అందజేయాలో తానే చెబుతానని చెప్పాడు. దీనికి అంగీకరించిన ప్రేమ్‌చంద్ ఈనెల 21న మధ్యాహ్నం పటాన్‌చెరులో పార్సిల్ గా వచ్చిన నకిలీ కరెన్సీ బ్యాగు తీసుకుని నిజాంపేట్‌కు చేరుకున్నాడు. రాకేశ్ చెప్పిన వ్యక్తి కోసం వేచిఉండగా.. అప్పటికే సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు ప్రేమ్‌చంద్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.15లక్షల నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# బీజేపీకి షాక్.. విసవదార్ అసెంబ్లీ ఉప ఎన్నికలో ఆప్ ఘన విజయం

న్యూఢిల్లీ, జూన్ 23: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సొంత రాష్ట్రం గుజరాత్ లో బీజేపీ కి గట్టి షాక్ తగిలింది. గుజరాత్‌లోని విసవదార్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఘన విజయం సాధించింది. బీజేపీ అభ్యర్థిపై ఆప్ బలపర్చిన అభ్యర్థి ఘన విజయం సాధించారు. 17 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

లూథియానా (పంజాబ్), కాళీగంజ్ (పశ్చిమబెంగాల్), కాడి, విసవదార్ (గుజరాత్), నీలంబూర్ (కేరళ) స్థానాలకు ఈనెల 19న ఉప ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఈరోజు ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఇందులో విసవదార్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి గోపాల్ ఇటాలియా (ఉనీజూజీశ్రీ ఎబిజీశ్రీతిజీ) ఘన విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి కిరీట్ పటేల్‌పై 17 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో గోపాల్ ఇటాలియాకు 75,000 కంటే ఎక్కువ ఓట్లు రాగా, కిరీట్ పటేల్‌కు 58,000 కంటే ఎక్కువ ఓట్లు వచ్చాయి. కాగా, గత ఎన్నికల్లో విసవదార్ నుంచి గెలుపొందిన ఆప్ ఎమ్మెల్యే భయానీ భూపేంద్రభాయ్ తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన విషయం తెలిసిందే.

# రైతులకు సరిపడా ఎరువులు పంపించాలి : పీఏసీఎస్ చైర్మన్ సుబ్బ దత్తుమూర్తి



ఆదిలాబాద్, జూన్ 23:తాండూర్ మండల రైతాంగానికి సరిపడా ఎరువులు జిల్లా వ్యవసాయాధికారులు సమకూర్చాల్సిందిగా పీఏసీఎస్ చైర్మన్ సుబ్బ దత్తుమూర్తి కోరారు. తాండూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించి పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా దత్తుమూర్తి మాట్లాడుతూ.. తాండూర్ మండలానికి 60 మెట్రిక్ టన్నుల ఎరువులు కావాలని అడిగితే కేవలం 12 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారన్నారు. దీంతో ఎరువులను రైతులకు పంచడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

ప్రతీ రైతుకు రెండు బ్యాగులు ఇస్తున్నా వారు అదనంగా బ్యాగులు కావాలని ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. ఈ ప్రాంత రైతుల పరిస్థితి అర్థం చేసుకొని రైతులందరికి అందే విధంగా ఎక్కువ మోతాదులో పంపించాలని అధికారులను కోరారు. అలాగే ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్పీవో)లో భాగంగా సంఘంలోని ప్రతీ రైతు రూ. 2వేలు చెల్లించి సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని కోరారు.

సభ్యత్వము పొందిన వారికి సంఘం ద్వారా జరిగే వ్యాపారంలో రాయితీ పొందవచ్చునని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు కదారి రత్నాకర్ రావు, డైరెక్టర్లు గట్టు మురళీధర్ రావు, మాసాడి తిరుపతి, పూసాల రాజేశం, ఎంఏ రవూఫ్, సీఈవో శ్రీనివాస్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# వేడుకగా ఎమ్మెల్యే పుట్టినరోజు.. మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న అభిమానులు



మహబూబ్‌నగర్, జూన్ 23: నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి జన్మదినం కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, పార్టీ అభిమానుల సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం జరిపించారు. అనంతరం ఎమ్మెల్యే పిలుపు మేరకు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో అభిమానులు, పార్టీ జిల్లా, మండలాల, గ్రామాల పార్టీ బాధ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకుల్లో పాల్గొనడం కోసం మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి పార్టీ కార్యకర్తలు డప్పు వాయిద్యాలతో వాహనాలలో తరలివచ్చి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి కూచుకుల్ల ఫౌండేషన్ తరుపున వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు, ఆహారం అందించారు.

అలాగే కొల్లాపూర్ క్రాస్ రోడ్డులో ఉన్న శ్రీ బాసర సరస్వతి దేవి ఆలయంలో, జ్ఞాన వాత్సల్య అనాధ బాలల ఆశ్రమంలో అన్నదాన వితరణ నిర్వహించారు. గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ బాధ్యులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, అభిమానులు, వివిధ సంస్థల యూనియన్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యుత్ స్తంభం పైనుంచి పడి యువకుడికి గాయాలు

హైదరాబాద్, జూన్ 23: విద్యుత్ స్తంభం ఎక్కిన యువకుడికి షార్ట్ సర్క్యూట్ కావడంతో స్తంభం పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డ సంఘటన శాలిగౌరారం మండలంలోని భైరవునిబండ గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముప్పటి నవీన్ అనే యువకుడు తన వ్యవసాయ బావి వద్ద అమర్చిన బోరు మోటర్‌కు కనెక్షన్ కోసం వైర్లను కలిపేందుకు స్థానిక సబ్ స్టేషన్‌లోని ఆపరేటర్‌కు ఫోన్ చేసి కరెంట్ సరఫరాను నిలిపివేయాలని సమాచారం ఇచ్చాడు.

అంతలోనే నవీన్ అనే యువకుడు స్తంభం ఎక్కి వైర్లను కలుపుతున్న క్రమంలో ఆపరేటర్ గమనించక కరెంట్‌ను పునరుద్ధరించడంతో విద్యుత్ షాక్‌కు గురై స్తంభం పై నుండి కిందపడ్డాడు. క్షతగాత్రుడిని వెంటనే నల్లగొండలోని ప్రైవేట్ దవాఖానాకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా సోమవారం బాధితుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు స్థానిక సబ్ స్టేషన్ వద్దకు చేరుకుని ఆపరేటర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని, తమకు న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సబ్ స్టేషన్ వద్దకు చేరుకుని పరిస్థితిని అదుపు తప్పకుండా చూశారు. విద్యుత్ ఏఈ అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడారు.

# హైదరాబాద్ ప్రగతి నగర్‌లో శాన్‌ఫోర్ట్ గ్రూప్ 4వ ప్రీస్కూల్‌ను ప్రారంభం



హైదరాబాద్, జూన్ 23: హైదరాబాద్‌లో ప్రగతి నగర్‌లో పనిచేస్తున్న నాల్గవ ప్రీస్కూల్ శాఖను ప్రారంభించడంతో శాన్‌ఫోర్ట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ప్రారంభ బాల్య విద్యలో తన ఊపును బలోపేతం చేస్తూనే ఉంది. ఈ విస్తరణ తెలంగాణలో బ్రాండ్ వారసత్వాన్ని మరింత పెంచుతుంది, ఈ ప్రాంతంలోని అదనపు కుటుంబాలకు ప్రపంచ స్థాయి ప్రారంభ అభ్యాస అనుభవాలను అందిస్తుంది.

ఎన్ ఆర్ ఐ కాలనీలోని జగన్ స్టూడియోస్ సమీపంలోని మాగ్విస్టా విల్లాస్‌లోని విల్లా నంబర్ 15 వద్ద ఉన్న ఈ కొత్తగా ప్రారంభించబడిన కేంద్రం ఇప్పటికే తల్లిదండ్రుల నుండి ఉత్సాహభరితమైన ప్రతిస్పందనను పొందింది. 2025?26 విద్యా సంవత్సరానికి ప్రారంభమయ్యాయి, ప్రస్తుతం 1.5 సంవత్సరాల నుండి 5+ సంవత్సరాల వయస్సు గల పిల్లలను చేర్చుకుంటున్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.కె. మాట్లాడుతూ, "హైదరాబాద్‌లో మా ఉనికిని విస్తరించడానికి మేము సంతోషిస్తున్నాము. ప్రగతి నగర్ ఒక అభివృద్ధి చెందుతున్న ప్రగతిశీల సమాజం, ఇక్కడి కుటుంబాలకు ప్రపంచ ఆవిష్కరణలను భారతీయ విలువలతో మిళితం చేసే ప్రీస్కూల్‌ను అందించడానికి మేము గర్విస్తున్నారు ఇది నగరంలో మా నాల్గవ కేంద్రం - ఖచ్చితంగా చివరిది కాదు" అని సాన్‌ఫోర్ట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకుడు ఓ ఛైర్మన్ రాథోడ్ అన్నారు.

సృజనాత్మక ఆట, కళ చేతిపనులు, సంగీతం కదలిక సెషన్‌లు, కథ చెప్పే థియేటర్ కాన్సెప్ట్-ఆధారిత డిస్కవరీ ల్యాబ్‌ల కోసం ప్రత్యేక కార్యాచరణ మండలాలు అదనపు లక్షణాలలో ఉన్నాయి. ఈ కేంద్రం ఇంటరాక్టివ్ స్మార్ట్ ప్యానెల్‌లు, ఏఆర్-ఆధారిత అనుభవ మాడ్యూల్స్, డిజిటల్ ప్రోగ్రెస్ ట్రాకింగ్ సజావుగా అభ్యాస అనుభవాన్ని నిర్ధారించడానికి యాప్‌ను కూడా అనుసంధానిస్తుంది.


శాన్‌ఫోర్ట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ సహ వ్యవస్థాపకురాలు ఓ డైరెక్టర్ కవితా రాథోర్ ఇలా మాట్లాడుతూ, "ప్రతి శాన్‌ఫోర్ట్ కేంద్రం ప్రేమ శ్రద్ధతో నిర్మించబడింది, కానీ ఇది ప్రత్యేకంగా ప్రత్యేకమైనది. సందర్శించే తల్లిదండ్రుల నుండి మాకు ఇప్పటికే అందిన వారి అభిప్రాయం చాలా సానుకూలంగా ఉంది. ఉత్సాహంగా వారి పిల్లల అభ్యాస ప్రయాణంలో భాగం కావడం మాకు గౌరవంగా ఉంది."

1999లో విద్యావేత్తలు డాక్టర్ ఎస్.కె. రాథోర్ కవితా రాథోర్ స్థాపించిన శాన్‌ఫోర్ట్, భారతదేశంలో ప్రీస్కూల్ విద్యను దాని పిల్లల-కేంద్రీకృత, ప్లేవే-ప్రేరేపిత యుకె-ఆధారిత పద్ధతితో విప్లవాత్మకంగా మార్చింది. దీని యాజమాన్య కోర్ వాల్యూ సర్కిల్ ప్రతి బిడ్డ అభివృద్ధి ప్రయాణంలో నైతిక విలువలు, జీవిత నైపుణ్యాలు, భావోద్వేగ మేధస్సు అనుభవపూర్వక అభ్యాసాన్ని పొందుపరచడానికి ఒక విలక్షణమైన ఫ్రేమ్‌వర్క్‌ను అందిస్తుంది.

నేడు, ఈ బృందం భారతదేశం, నేపాల్ బంగ్లాదేశ్ అంతటా 250 కి పైగా కేంద్రాలను నిర్వహిస్తోంది. టచ్ 'ఎన్' లెర్న్ టెక్నాలజీని ఇటీవల, బాల్య విద్యలో ఆగ్మెంటెడ్ రియాలిటీ మాడ్యూళ్ళను ప్రవేశపెట్టినందుకు గుర్తింపు పొందింది. ప్రీస్కూల్ అభ్యాసంలో దాని ఆవిష్కరణకు శాన్‌ఫోర్ట్ 90 కి పైగా జాతీయ అంతర్జాతీయ అవార్డులను గెలుచుకుందన్నారు.


ఆహ్వానం

కిన్నెర ఆర్ట్ థియేటర్స్






ప్రముఖ రచయిత

శ్రీ చిటిప్రోలు సుబ్బారావుగారు రచించిన

వెన్నెలగింజలు కవితా సంపుటి ఆవిష్కరణ

శనివారం 28-6-2025, సా॥ 6 గంటలకు

Centre for Economic and Social Studies
Lane Beside Dr Agarwal Eye Hospital
Punjagutta Officers Colony,
Near Punjagutta Metro Station, Hyderabad

ముఖ్యఅతిథి : జస్టిస్ శ్రీ ఎన్.వి. శ్రవణ్ కుమార్, న్యాయమూర్తి, తెలంగాణ హైకోర్టు

అధ్యక్షులు : డా॥ కె.వి.రమణ, ఐఎఎస్ (వి), పూర్వ సలహాదారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

విశిష్ట అతిథి : డా॥ వోలేటి పార్వతీశం, ప్రముఖ సాహితీవేత్త

గౌరవ అతిథి : శ్రీ దుర్గంపూడి చంద్రశేఖర్ రెడ్డి, సంపాదకులు, ఎమెస్కో

ఆత్మీయ అతిథి : డా॥ బీరం సుందరరావు, ప్రముఖ రచయిత

సాంస్కృతిక కార్యక్రమం : సా॥ 6 నుండి 6-45 వరకు

నృత్య కిన్నెర సమర్పించు అమృతోత్సవ భారతి కూచిపూడి నృత్య రూపకం

నృత్య దర్శకత్వం: హంస పురస్కార గ్రహీత, కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కార గ్రహీత డా॥ మద్దాళి ఉషాగాయత్రి

సంగీత దర్శకత్వం: శ్రీమతి శ్రీవల్లీ శర్మ

సభానంతరం విందు భోజనం

డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (వి) అధ్యక్షులు | సర్వా శ్రీనివాస్ నిర్వాహకులు | మద్దాళి రఘురామ్ కార్యదర్శి


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.